నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | జూన్ 21, 2024 | www.navatelangana.com

వేతనాలు చెల్లించాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-కోటగిరి

తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికుల ధర్నా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడారు. జీపీ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి స్పందించి బడ్జెట్ విడుదల కాలేదని, రెండురోజుల్లో రెండునెలల జీతం ఇప్పించే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.



ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని సిద్ధార్థ విద్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 పై సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ స.హా చట్టం దరఖాస్తు విధానాన్ని, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారుల చిట్టా ప్రజలకు తెలియజేయడానికి స.హ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది, రాష్ట్ర స్పోక్స్ పర్సన్ శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌గౌడ్, స.హ చట్టం జిల్లా ఉపాధ్యక్షులు అలీముద్దీన్, జిల్లా సలహాదారులు న్యాయవాది సతీష్, లతీఫ్, మండల ఉపాధ్యక్షులు బాబు, ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ సలీం



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ధరణి పెండింగ్

దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత

● రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా వెనువెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని అన్నారు. గురువారం డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

సంబంధిత రెవెన్యూ అధికారులతో పాటు, ఆపరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిలో ఎన్ని పరిష్కరించారు, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని ఆరా తీశారు. పెండింగ్ దరఖాస్తులను రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో పరిష్కరించాలని గడువు విధించారు. తహసీల్దార్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికా బద్ధంగా కృషిచేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను అవసరమైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన తర్వాత పరిష్కరించాలని అన్నారు. ఆయా గ్రామాల వారీగా దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వాటి పరిష్కారంలో తాత్సారానికి తావులేకుండా చూడాలన్నారు. నిర్ణీత గడువులోపు ధరణికి సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్, ఆర్.ఐ ప్రభురాజ్, కార్యాలయ అధికారులు సిబ్బంది ఉన్నారు.

జూనియర్ కాళాశాల మంజూరు చేశారు..

భవన నిర్మాణం మరిచారు..

● జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో కొనసాగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ

● సొంత భవనం లేకపోవడంతో అయోమయంలో విద్యార్థులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. విద్యార్థులకు చదువు చెప్పేందుకు పక్కా భవనాన్ని నిర్మించలేదు. దీంతో చదువు ఎక్కడ బోధిస్తారోనని అడ్మిషన్ అయిన విద్యార్థులు అయోమయంలో ఉన్నారు.

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాలను 2023 నవంబర్‌లో మంజూరు చేసింది. కానీ కళాశాల భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు. దాంతో గత సంవత్సరం మండల కేంద్రంలో గల జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్లు నిర్వహించడానికి ఒక ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. ఆలస్యంగా కళాశాల మంజూరు కావడంతో నవంబర్‌లో కొంతమంది ఓపెన్ టెన్త్ చేసిన విద్యార్థులు ఓపెన్ ఇంటర్‌గా 20 మంది కళాశాలలో అడ్మిషన్ అయ్యారు. గత సంవత్సరం అడ్మిషన్ అయిన విద్యార్థులు ఎగ్జామ్ ఫీజు కట్టలేకపోవడంతో వారు పరీక్ష రాయలేకపో యారు. 2024-25 జూన్ మొదటివారం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్లు మండల కేంద్రంలో గల జెడ్పిహెచఎస్ పాఠశాలలోనే ఓ తరగతి గదిలో నిర్వహిస్తున్నారు. గురువారం వరకు 62 మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో అడ్మిషన్ అయ్యారు. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తెలుగు/ఇంగ్లీష్ మీడియం అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నారు.



తరగతులు నిర్వహించేందుకు ఖాళీగా తాత్కాలిక భవనం



ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లను తీసుకుంటున్న లెక్చరర్

అయోమయంలో విద్యార్థులు లెక్చరర్లు..

ప్రస్తుతం జూనియర్ కళాశాల సొంత భవనం లేకపోవడంతో మండల కేంద్రంలో గల జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో ఓ గది కేటాయించి అడ్మిషన్ల నిర్వహణ కొనసాగిస్తున్నారు. విద్యార్థులు అడ్మిషన్ అయిన తర్వాత తరగతులు ఎక్కడ నిర్వహించాలని లెక్చరర్లు సందేహంలో ఉన్నారు. అదేవిధంగా అడ్మిషన్ అయిన తర్వాత తరగతులు నిర్వహిస్తారా?, లేదా? పరిస్థితి ఎంటని విద్యార్థుల్లో సైతం అయోమయం నెలకొంది.

తాత్కాలిక లెక్చరర్లతో అడ్మిషన్ల ప్రక్రియ..

ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్ల ప్రక్రియ తాత్కాలిక లెక్చరర్లతోనే నిర్వహిస్తున్నారు. పిట్లం జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న విష్ణు, ఎల్లారెడ్డి ప్రభుత్వాల జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న నాగయ్యతో పాటు ప్రిన్సిపాల్‌గా హేమచందర్‌ను నియమించారు.

రెండేండ్ల క్రితం భవాననిర్మాణానికి స్థల పరిశీలన..

నాగిరెడ్డిపేట్ మండలానికి జూనియర్ కళాశాల మంజూరు ప్రక్రియ కంటే ముందు భవన నిర్మాణం చేయడానికి గోలిలింగాల్ బీటీ రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో జూనియర్ కళాశాల నిర్వహించాలని అప్పటి సంబంధిత అధికారులు స్థలాన్ని పరిశీలించినా.. ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

సద్వినియోగం చేసుకుంటేనే మేలు..

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్నా.. జూనియర్ కళాశాలలో విద్యార్థుల శాతం అనుకున్న స్థాయికి రాకపోతే కళాశాల నాగిరెడ్డిపేట్ నుంచి తరలిపోయే అవకాశం ఉంది. ఇక్కడే కళాశాల కొనసాగాలంటే గెజిటెడ్ హెడ్మాస్టర్లు కళాశాలకు పూర్తిస్థాయిలో సహకరిస్తే ఖచ్చితంగా కళాశాల ఇక్కడే కొనసాగే అవకాశం ఉంది. గెజిటెడ్ హెడ్మాస్టర్‌లతోపాటు ఆయా గ్రామాల ప్రజాపతినిధులు విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాల వైపు మళ్లిస్తే జూనియర్ కళాశాల నాగిరెడ్డిపేట్ మండలంలోనే కొనసాగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అనుకున్న స్థాయిలో విద్యార్థులు కళాశాలలో చేరితే తరగతి గదులు ఏర్పాటు చేయడంతో పాటు ఫ్యాకల్టీని సంబంధిత శాఖ అధికారులు నియమించే అవకాశం ఉంది.

అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో ప్రారంభించబడిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్ చేసుకోవడంతో పాటు పాఠ్యపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. అదేవిధంగా సంవత్సరానికి రూ.5000 స్కాలర్‌షిప్ కూడా ప్రభుత్వం అందజేస్తుంది. ఈ అవకాశాన్ని నాగిరెడ్డిపేట్ మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- ప్రిన్సిపాల్ హేమచంద్ర

అడ్మిషన్లు పెంచేందుకు కృషిచేస్తున్నాం

మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంచడానికి గ్రామగ్రామాన తిరుగుతూ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఫోన్ నెంబర్లు తీసుకుని వాళ్ళ ఇండ్లకు వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. కళాశాలలో అడ్మిషన్ అయ్యేలా అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటివరకు 62 మందిని అడ్మిషన్ చేయించాం.

- లెక్చరర్ విష్ణు

పరిశుభ్రతతో రోగాలు దూరం

● కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

పరిశుభ్రత పాటించడం వల్ల రోగాల బారి నుంచి రక్షించుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. 14వ జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ముదాంగల్లీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడుపులో నట్టలు ఉంటే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి వంటి వాటితో బాధపడతారని అన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశభవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, ఆ దిశగా ప్రభుత్వం ఏటా ఫిబ్రవరి, జూన్ మాసాలలో రెండు పర్యాయాలు ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తున్నదని అన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల కడుపులో పురుగులు, నట్టలు నశిస్తాయని, అనీమియాను నియంత్రించవచ్చని, నట్టలు నశించి ఆరోగ్యవంతంగా పెరుగుతారని అన్నారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాలలోపు 2,50,254 మంది పిల్లలున్నారని గుర్తించామని, వారికి వందశాతం మాత్రలు అందించేలా కార్యాచరణ రూపొందించి నేడు మాత్రలు అందిస్తున్నామని, ఏదేని కారణం చేత ఈ రోజు మాత్రలు వేసుకోని వారికి తిరిగి ఈ నెల 20న ఆల్బెండజోల్ మాత్రలు వేయించి వందశాతం లక్ష్యం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలకు ఒక మాత్రను నలిపి ఇవ్వాలని, 3 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు చప్పరించేలా వేయించాలని అధికారులకు సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలలో ఏ ఒక్కరినీ విడిచిపెట్టకుండా మాత్రలు వేయాలని అన్నారు. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి సైతం ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు వేయించాలని, ఎట్టి పరిస్థితులలో మాత్రలు ఇంటికి తీసుకెళ్లేందుకు అనుమతించకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం అందించే ఆల్బెండజోళ్ మాత్రలు చాలా శ్రేష్ఠమైనవని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు, ఇన్ఫెక్షన్‌లు రాకుండా ఈ మాత్ర పనిచేస్తుందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠాశాలల కింద చేపట్టిన టాయిలెట్ బ్లాక్స్, మంచినీటి ట్యాంక్, కుళాయిలు, తరగతి గదులలో లైట్లు, ఫ్యాన్స్ ఏర్పాటు, కిటికీల మరమ్మతులు పనుల ప్రగతిని పరిశీలించి ప్రధానోపాధ్యాయులు, మహిళా సమాఖ్య సభ్యురాలిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతూ ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందిస్తున్న ఒక్క రూపాయి ఖర్చుకాకుండా శిక్షితులైన అధ్యాపకులచే బోధన గావిస్తున్నామని, విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ కోరారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మాట్లాడుతూ శుభ్రత పాటించకుండా చేతులు నోట్లో పెట్టుకోవడం, గోళ్ల గిల్లుకోవడం, పాదరక్షలు లేకుండా మట్టిలో ఆడుకోవడం వళ్ళ కడుపులో పురుగులు పడే అవకాశముందని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ పాఠశాల పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థినులు లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా కృషిచేయాలని తమ వంతు సహకారమందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వనిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, డీఈఓ రాజు, ఎంఈఓ ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

వికలాంగుల చట్టాల అమలులో

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విఫలం

● ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

నవతెలంగాణ-బోధన్

వికలాంగుల చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఉర్దూఘర్‌లో నిర్వహిస్తున్న ఎన్.పీ.ఆర్.డీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వికలాంగుల పెన్షన్‌ను తక్షణమే రూ.6000 లకు పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగుల చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని అన్నారు. వికలాంగుల పెన్షన్‌లు తక్షణమే పెంచకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.21శాతం మంది వికలాంగులు ఉన్నారని అన్నారు. కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సామాజిక గణాంకాల విభాగం విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం 19 శాతం మంది చూపు, వినికిడి లోపం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. 8శాతం మంది బహుళ వైకల్యం కలిగి ఉన్నారని అన్నారు. 76శాతం మంది గ్రామీణ ప్రాంతంలో, 24శాతం మంది పట్టణ ప్రాంతంలో నివసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వయేతర సౌకర్యాలు వికలాంగులకు అందడం లేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వికలాంగులు ఉంటే పెన్షన్స్ కేవలం 5.75లక్షల మందికే వస్తుందని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రకటించి, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. శారీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గిస్తూ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ సవరించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. వికలాంగులపై జరుగుతున్న వేధింపులు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని నిర్ణయం చేసినా.. ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న వివాహ ప్రోత్సాహకం నిధులు వెంటనే విడుదల చేయాలని అన్నారు. రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అధికారులు వారి వైఖరి మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. సామూహిక ప్రాంతాలన్నీ అవరోధ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసి 4 ఏండ్లు అవుతున్నా ఎలాంటి పురోగతి లేదన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమలు పర్యవేక్షణ కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో కోఆర్డినేషన్ కమిటీలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. మానసిక, ఆటిజం, హిమోఫిలియా, సికిల్ సెల్ కండరాల క్షీణత వంటి వైకల్యాలు కలిగిన వికలాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మానసిక వైకల్యం కలిగిన విద్యార్థులు 5లక్షల మంది ఉన్నారని వీరికి ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల్లో చదువుకునే హక్కు లేకుండా పోతుందని అన్నారు. 2009 విద్య హక్కు చట్టం, 2016 ఆర్పీడబ్ల్యూడీ చట్టం మానసిక వైకల్యం కలిగిన వారికి పాఠశాలల్లో అడ్మిషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూగ, చెవిటి వైకల్యం కలిగిన విద్యార్థులు 2 లక్షల మంది ఉంటే వీరికి సైన్ లాంగ్వేజ్ అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి వారికి విద్య అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆసరా పెన్షన్స్ ప్రతి నెల పంపిణీ చేయకపోవడం వలన లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పెన్షన్ పెంచకుంటే రాష్ట్ర వ్యాపిత ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. బోధన్ పట్టణంలో జూలై 31న ఎన్.పీ.ఆర్.డీ నిజామాబాద్ జిల్లా 3వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బసవరాజు, జిల్లా అధ్యక్షురాలు కవిత, రాష్ట్ర కమిటీ సభ్యులు గైని రాములు, యేశాల గంగాధర్, జిల్లా నాయకులు నజీర్, రాములు, గోపాల్, ఎల్లయ్య, సావిత్రి, బీరప్ప, హమీనాబీ, రాజు, గంగారాం, హరిప్రియ, లక్ష్మి, సోనితో పాటు వివిధ మండలాల వికలాంగులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

● సీపీఐ(ఎం) డిమాండ్

● కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నీట్ పరీక్ష లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. సీపీఐ(ఎం) పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంతవరకు విద్యాశాఖ మంత్రి బాధ్యతల నుంచి వైదొలగాలని నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను ఎన్‌టిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నదని, ప్రధానంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పేపర్ లీకేజీ ఇతర అవకతవకలకు పాల్పడుతున్నాయని ఉద్దేశంతో 2019 నుంచి దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష విధానాన్ని రూపొందించి నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఈ సంవత్సరం 24 లక్షలకుపైగా విద్యార్థులు నీట్ పరీక్షను రాశారని, ఈ పరీక్షలకు బిజెపి పాలిత రాష్ట్రాలైన గుజరాత్, బీహార్ రాష్ట్రాలలో ఒక్కొక్క విద్యార్థి దగ్గర 30 నుంచి 50 లక్షల రూపాయల వరకు వసూలు చేసి పేపర్ లీకేజీకి పాల్పడ్డారని, దీని మూలంగా కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని తెలిపారు. అంతేకాకుండా పరీక్ష కీ పేపర్‌ను విడుదల చేసిన మరుసటి రోజే ప్రకటించటం వలన విద్యార్థులు నష్టపోయారని ఆయన అన్నారు. ఇంతటి అవినీతి అక్రమాల మూలంగా లక్షలాది మంది ప్రజలు ఆందోళన చెందుతుంటే ప్రధానమంత్రి కానీ కేంద్ర ప్రభుత్వం కానీ నోరు మెదపకుండా ఉండటం వలన అవినీతిపరులకు దోచుకోవటానికి అవకాశం కల్పించిన వారవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించి నీట్ పరీక్ష అవకతవకలపైన సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని తిరిగి నీట్ పరీక్షను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకటరాములు, నూర్జహాన్, శంకర్‌గౌడ్, పి.వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విగ్నేష్, మహేష్, సూరి, కటారి రాములు తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్



కామారెడ్డి : దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, పేపర్ లీక్ చేయించి 720 మార్కులకు 720 మార్కులు 69 మందికి ఒకే సెంటర్‌లో సీరియల్ నెంబర్ విద్యార్థులకు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ తెలిపారు. ఎన్‌టిఏ అవలంబిస్తున్న విధానాల కారణంగా పరీక్షలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దీనితో నీట్‌పై సిలబస్ విషయంలో విద్యార్థులకు అనుమానం వ్యక్తం అయ్యిందని వివరించారు. బీహార్ రాష్ట్రంలో పాట్నాలో మే 4వ తేదీన పేపర్ లీక్ అయిందని 13 మందిని పోలీసులు అరెస్టు చేశారని, విద్యార్థుల నుండి ఒక్కొక్కరి దగ్గర రూ.30 నుంచి 50 లక్షలు వసూలు చేసి పేపర్ లీక్ చేయించి ఇచ్చారని అక్కడ పోలీసుల ద్వారా సమాచారం తీసుకున్నారని పేర్కొన్నారు. పేపర్ లీకేజీలు ముఖ్య దందా గుజరాత్ రాష్ట్రంలో ఎడ్యుకేషన్ అధినేత పురుషోత్తం రాయి అనే వ్యక్తి ఈ పేపర్ లీకేజీలో ముఖ్య సూత్రధారిని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు ఆ వ్యక్తిని అరెస్టు చేయకపోవడంతో ప్రభుత్వాల మీద అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నారు. వెంటనే సంబంధిత బాధ్యులను అరెస్టు చేయాలని, ఈ పేపర్ లీకేజీలపై సీరియస్‌గా కేంద్ర ప్రభుత్వం తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేవిధంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సర్వే పరిశీలించిన ఎంపీవో


సర్వే నిర్వహిస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-నందిపేట్

మండలకేంద్రంలో ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీరు అందుతుందా.. లేదా.. అనే విషయమై సర్వే నిర్వహించారు. సర్వేను మండల మండల పంచాయతీ అధికారి కిరణ్ కుమార్ గురువారం పరిశీలించారు. సర్వే సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. భగీరథ ద్వారా ఇంటింటికి మంచినీరు అందుతుందా.. లేదా.. ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి నవీన్ ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలలో విజయ్ విద్యార్థిని



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ గేమ్స్ ఫెడరేషన్ 2024 వారి ఆధ్వర్యంలో థైత్ లాన్ జాతీయస్థాయి పోటీలు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 14 నుండి 16 వరకు నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనగా విజయ్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న ఎన్.మేఘన సైక్లింగ్, స్విమ్మింగ్, పరుగుపందెం పోటీలలో పాల్గొని ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థినిని పాఠశాల కార్యదర్శి డాక్టర్అమృతలత అభినందించారు.

రోడ్డు బాగాలేక నిత్యం ప్రమాదాలు

- పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు


గుంతలుగా మారిన రోడ్డు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలకేంద్రంలోని నిజామాబాద్ నుండి హైదరాబాద్ వెళ్లే రహదారి ఈ రోడ్డు వెంబడి నిత్యం కొన్ని వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు వాసరి సాయినాథ్ అన్నారు. హైదరాబాద్ నుండి వచ్చే వాహనాలు వేగంగా వచ్చి గుంతలు కనిపించే సరికి సడన్ బ్రేక్ వేయడం ద్వారా వెనకాల వచ్చే వాహనం ఢీకొని లేని ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారని అన్నారు. అధికారులు చర్యలు తీసుకుని రహదారి బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్ల వెనక ఉన్న ద్విచక్ర వాహనాలు ఒకరికి ఒకరు ఢీకొంటున్నాయని, ఈ ప్రమాదాల్లో ఇప్పటికే పలువురు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. వర్షాకాలంలో మరింత పెద్ద గుంతలు ఏర్పడి ప్రజలకు, వాహనా దారులకు ఇబ్బంది కరంగా మారిందని వివరించారు. ఇలా నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోని రోడ్డు బాగుచేయాలని అన్నారు.

రామోజీకి నివాళులు అర్పించిన కోటపాటి

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనాడు దినపత్రిక, రామోజీ ఫిలిం సిటీ నిర్మాత రామోజీరావు దశదిన కర్మలో రైతు నాయకుడు కోటపాటి నరసింహం నాయుడు పాల్గొన్నారు. గురువారం రామోజీ ఫిలిం సిటీలో దశదిన కర్మ నిర్వహించారు. ఈసంద ర్భంగా రామోజీ రావుకు నివాళులు అర్పించారు. రామోజీరావు దేశం గర్వించదగిన స్థాయిలో ఇటు పత్రికారంగాన్ని నడిపించి, ప్రపంచస్థాయి ఫిలింసిటీ నిర్మించారని అనాన్నరు. వేలాది మందిని ప్రత్యక్షంగా, లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి కల్పించిన గొప్ప వ్యక్తి రామోజీరావు మరణం ఉభయ రాష్ట్రాలకు తీరని లోటు అని కోటపాటి అభివర్ణించారు. రామోజీరావు మనవడు సుజయ్ (సుమన్ కొడుకు)ను కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు.

లలిత కుటుంబానికి న్యాయం చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని మున్సిపల్ నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికురాలు లలిత విధి నిర్వహణలో ట్రాక్టర్‌పై వస్తున్న సందర్భంగా ప్రమాదవశాత్తు మరణించారన్నారు. మరణించిన ఆమె కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు ఈఎస్ఐ, పిఎఫ్ ఇన్సూరెన్స్, యాక్సిడెంట్ జరిగిన ట్రాక్టర్ ఇన్సూరెన్స్ బెనిఫిట్‌లను వారి కుటుంబానికి ఇప్పించే బాధ్యత నగరపాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో తెలపడం జరిగిందని అన్నారు. తెలంగాణ స్టేట్ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి కార్యనిర్వాహక అధ్యక్షులు పి.సుధాకర్, ప్రధాన కార్యదర్శి పి.నర్సింగరావు, సందీప్, లలిత కుటుంబీకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి వాసికి డాక్టరేట్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన గడ్డం శ్రీనివాస్ రెడ్డి 'లిమ్నలాజికల్ స్టడీస్ ఆఫ్ నిజాంసాగర్ రిజర్వాయర్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. శ్రీనివాస్ రెడ్డి మొట్టమొదట స్కూల్ అసిస్టెంట్‌గా నిజాంసాగర్‌లో 6 సంవత్సరాలు పనిచేసిన తర్వాత జూనియర్ లెక్చరర్ గా ప్రమోషన్ పొందారు. జూనియర్ లెక్చరర్ గా15 సంవత్సరాలు ఐలాపూర్, నిజామాబాద్ ఖిల్లా కాలేజీలో పనిచేసిన తర్వాత 2016 లో డిగ్రీ లెక్చరర్‌గా ప్రమోషన్ పొంది గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మోర్తాడ్ లో పనిచేశారు. 2018 నుండి ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, జంతు శాస్త్ర విభాగ అధిపతిగా కొనసాగుతున్నారు. కాగా శ్రీనివాస్ రెడ్డికి హన్మకొండలోని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ టి. రవీందర్ రెడ్డి గైడ్‌గా వ్యవహరించారు.

వర్షాకాల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అధ్యక్షతన వర్షాకాల యాక్షన్ ప్లాన్ పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాల సీజన్ ఆరంభమైనందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వచ్చే ఆస్కారం ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చివేయాలన్నారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, పరిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పైపులైన్ లీకేజీలు లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వర్క్ ఫైల్స్, 7 రిజిస్టర్లు, జాబ్ కార్డ్స్ అప్డేషన్, నేమ్ బోర్డ్స్ ఎరాక్టింగ్, జన్మంరేగా యాప్ ఇన్స్టాలేషన్, డిమాండ్ ఫార్మ్స్, రోజ్గర్ దివస్ రిజిస్టర్, ఫార్మ్ పాండ్ వర్క్స్, టీకే హెచ్ హెచ్ ఎస్టిమేట్స్, హార్టికల్చర్ ప్లాంటేషన్, అమృత్ సరోవర్ ప్రదేశాల్లో యోగ డే సెలబ్రేషన్, వాన మహోత్సవం, మిషన్ భగీరథ సర్వే, గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమాలు, త్రాగునీరు, పంచాయతీ రాజ్, రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో మండలంలో చేపట్టిన వివిధ పనులపై ఈ సమావేశంలో సమీక్షించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదాశివ్, ఈజీఎస్ ఏపీవో విద్యనంద్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఈజీఎస్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల కళాశాల ఆకస్మిక తనిఖీ చేసిన డీఐఈవో

- కళాశాల నిర్వహణ పట్ల సంతృప్తి


మాట్లాడుతున్న డీఐఈవో


పాల్గొన్న లెక్చరర్లు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ గురువారం నిజామాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వహణ, అధ్యాపకుల పనితీరు సమీక్షించి ప్రిన్సిపల్‌ను, సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో ఇదే విధంగా కళాశాలను అభివృద్ధి పథంలో ముందుకు నడపాలని ఆకాంక్షించారు. 2023-24 విద్యా సంవత్సరంలో నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలను సాధించడంపట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. వెయ్యి మార్కులకుగానూ అత్యధికంగా రెండవ సంవత్సరంలో 971 మార్కులు బీపీసీ విద్యార్థిని అయేష ఫాతిమా సాధించగా, ఒకేషనల్ మొదటి సంవత్సరం కంప్యూటర్ సైన్స్‌లో 500 మార్కులకు గాను 494 మార్కులు సాధించడం పట్ల జిల్లా ఇంటర్ విద్య అధికారి సంతృప్తిని వ్యక్తం చేశారు. బాలికల కళాశాల జిల్లాలో మంచి ఫలితాలు సాధించడం పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. బాలికల కళాశాలలో గత సంవత్సరం 1100 పైచిలుకు విద్యార్థులతో కళాశాలను ప్రిన్సిపాల్ సమర్థవంతంగా నిర్వహించడం పట్ల జిల్లా ఇంటర్ విద్యాధికారి అభినందించారు. కళాశాలలో అన్ని సబ్జెక్టులను బోధించడానికి అధ్యాపకులు ఉండడంతో పాటు ప్రయోగశాలలు, లైబ్రరీ, ఫర్నిచర్, మంచినీటి వసతి, మరుగుదొడ్లు, అధునాతన భవనాలతో బాలికల కళాశాలలో తరగతుల నిర్వహణపట్ల జిల్లా ఇంటర్ విద్యార్థి అధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో కళాశాలలో అడ్మిషన్లు పొంది ప్రభుత్వ ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అధ్యాపకులు మరింత ఉత్సాహంతో పని చేస్తూ తమ లక్ష్యాన్ని మించి ఫలితాలను సాధించడానికి కృషి చేయాలని ఆదేశించారు. అధ్యాపకుల పనితీరుతో పాటు కళాశాల కార్యాలయ సిబ్బంది, ఫైళ్ల నిర్వహణ పనితీరును అభినందించారు. సమావేశంలో వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్యను మరింత పెంచేందుకు ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పదవ తరగతి పాస్ అయి వచ్చిన ప్రతి విద్యార్థినికి అడ్మిషన్ ఇవ్వడానికి సిబ్బంది అందుబాటులో ఉంటారని కళాశాల ప్రిన్సిపాల్ నుస్రత్ జహాన్ తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది తనకు పూర్తి స్థాయి లో సహకరిస్తూ కళాశాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ప్రిన్సిపాల్ అన్నారు.

రైతులకు ఇచ్చిన హామీల అమలు చేయాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రైతులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని గురువారం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, క్యాబినెట్ సమావేశంలో రైతులకు ఏకకాలంలో 2 లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని అన్నారు. రైతుబంధు 7500 ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని, ధరణిలో వస్తున్న సమస్యలను వెంటనే పరిష్కారంచేసి వారికి కూడా రైతుబంధు రుణమాఫీ అమలు చేయాలని తెలిపారు. రైతులందరికీ రైతు బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి ఇప్పటివరకు నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వానకాలం పంట ప్రారంభమవుతున్న సందర్భంగా నాణ్యమైన విత్తనాలు అందించాలని అన్నారు. నాణ్యతలేని విత్తనాలు అమ్మిన యజమానులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తోగటి భూమేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు బొంబాయి నారాయణ, సుజాత, రాజు దినేష్ ఇతరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను ఇవ్వాలి

- ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్ టియు) నాయకులు అన్నారు. ఆరు నెలలుగా బాకీ ఉన్న పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్ నివేదిత రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా (ఐఎఫ్‌టీయూ) జిల్లా నాయకులు మురళి మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ కార్మికుల శ్రమ ఉందని, కానీ వారి శ్రమకు తగ్గ ఫలితం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తూ వారి శ్రమను దోస్తున్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేస్తున్నా మన్నారు. ఎవరైనా కార్మికుడు ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబానికి పది లక్షల రూపాయల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రవి, ప్రభాకర్, మహేష్, మోహన్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విరాళం

- నోటు పుస్తకాలు, స్టేషనరీ అందజేయడం అభినందనీయం
- ఎంపిడిఓ అనంతరావు


చిన్నారులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎంపిడిఓ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత మూడేళ్లుగా ఇందల్‌వాయి మండలంలోని గండి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేసిన విరాళం ద్వారా నోటు పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు అందజేయడం అభినందనీయమని ఎంపిడిఓ అనంతరావు అన్నారు. గురువారం ఇందల్‌వాయి మండలంలోని గండి తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.అనిలా తనవంతుగా అందజేసిన విరాళం 10వేల రూపాయలతో నోట్ పుస్తకాలు,స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఓ అనంత రావు పాల్గొని మాట్లాడుతూ.. గండి తండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విరాళం ద్వారా నోటు పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు డాక్టర్ అనిలా అందజేయడం హర్షనియమని అన్నారు. పేద విద్యార్థుల పట్ల సామజిక బాధ్యతతో విరాళం అందించడం గొప్ప విషయమని తెలిపారు. దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రుల మీద ఆర్థిక ఒత్తిడి తగ్గుతుందని, ఫలితంగా విద్యార్థుల హాజరు, వారిలో ఉన్న ప్రతిభ పెరుగుతుందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు మెరుగు పడ్డాయని, రాబోవు రోజుల్లో మరింతగా అభివృద్ధి చెందుతుందని అయిన అశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని, ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందజేయడం జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు బండి పరమేశ్వర్, విద్యార్థులు డాక్టర్ ఎం.అనిల్ ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, గ్రామ ప్రత్యేకాధికారి తాటి రాజీవ్, పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

డివి కృష్ణ రెండో వర్ధంతి సభను

- విజయవంతం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రజాపంథా పార్టీ నిర్మాణానికి మొదట అడుగులు వేసిన కామ్రేడ్ డివి.కృష్ణ రెండో సంస్మరణ సభను విజయవంతం చేయాలని ప్రజపంథా డివిజన్ కార్యదర్శి బి,దేవారం, తెలంగాణ ప్రతిశీల వీడియో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముత్తన్న అన్నారు. పట్టణంలోని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథ పార్టీ ఆధ్వర్యంలో కుమార్ నారాయణ భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐదు దశాబ్దాలపాటు విప్లవోద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన డివి కృష్ణ, పభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి నిజామాబాద్ జిల్లాలో విప్లవోద్యమానికి అడుగులు వేశారన్నారు. 2022 జూన్ 26 వరకు క్యాన్సర్‌తో మరణించే వరకు విప్లవోద్యమం వైపు నిలబడి కృషిచేసిన ఆదర్శ కమ్యూనిస్టు విప్లవ యోధుడు డివి కృష్ణ అని అన్నారు. సైదాంతికత రాజకీయ రంగాలన్నింటిని నిశితంగా పరిశీలన చేసి సరైన సిద్ధాంతం కోసం మొక్కవోని పోరాటం చేశాడని అన్నారు. సైద్ధాంతిక రాజకీయ విషయాలను ప్రజాఉద్యమ ఆచరణతో జోడించి తన అనుభవాల్ని కూడిన ఉద్యమాలకు దారి వేశాడని అన్నారు. ఎన్ని పనికిరాని విమర్శలు చేసిన రివిజనిస్టు అని నిందించిన చలించకుండా తను నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడ్డాడని అన్నారు. రెండవ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్‌లో వారి స్మారక స్థూపాన్ని ఏర్పాటుచేశామని, ఈనెల 26న స్థూప ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రజలు రావాలని కోరారు. సబ్‌డివిజన్ కార్యదర్శి బి.కిషన్ మాట్లాడుతూ.. సమ సమాజం కోసం పేదల రాజ్యం కోసం అలుపెరుగని పోరాటం చేసి ఎర్రజెండా నీడలోనే ఒరిగిన కామ్రేడ్ డివి కృష్ణ అన్న త్యాగం వెలకట్టలేనిదని, వారి ఆశయ సాధనలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా సబ్ డివిజన్ నాయకులు ఆకుల గంగారం, అమినపూర్ రమేష్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు నరేందర్, తలారి గంగాధర్, ఏరియా అధ్యక్షులు అనిల్ కుమార్, పద్మ, లక్ష్మి, సునీత, మమత, బట్టు రవి, నజీర్ పాల్గొన్నారు.

14 రకాల పంటలకు మద్దతు ధర రైతుకు నిరాశ మిగిల్చింది

ఏఐపీకేఎస్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

14 రకాల పంటలకు మద్దతు ధరతో రైతుకు నిరాశ మిగిలిందని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపికెఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, జిల్లా సహాయ కార్యదర్శి. బి. బాబన్న అన్నారు. గురువారం నగరంలోని కోటగల్లిలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి గాను 14 రకాల పంటలకు మద్దతు ధరతో రైతుకు నిరాశ మిగిలిందని, కేంద్ర మంత్రి అశ్విన్ వైష్ణవ్ దేశంలో సాగు చేస్తున్న 100 పంటలకు గాను 14పంటలకు మాత్రమే మద్దతు ధర నామమాత్రంగా పెంచి ప్రకటించారన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రణాళికలో పేర్కొన్నట్లుగా ఈ మద్దతు ధర ప్రకటన నేపథ్యం లేదని అన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలోను, తన ఎన్నికల ప్రణాళికలో రైతు పెట్టుబడి కి 50 శాతం కలిపి ధర నిర్ణయించి స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలుచేస్తామని రైతును రాజు చేస్తామని చిలక పలుకులు పలికి అధికారంలోకి వచ్చారన్నారు. ఎన్డీఏ తొలి మంత్రి మండలి సమావేశంలో వంద రకాలకు పైగా పంటలకు కేవలం 14 రకాల పంటలకు మాత్రమే ధర నిర్ణయించడం వ్యవసాయ రంగాన్ని, రైతును దివాళి చేయించేలా ఉందని భావిస్తున్నామన్నారు. మద్దతు ధర ప్రకటించే ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చుల అంచనా కమిషన్ నివేదికలను పరిగణలో తీసుకొని రైతు పెట్టుబడికి వడ్డీ, రైతు కుటుంబ శ్రమను పరిగణంలో తీసుకొని నిర్ణయించాలన్నారు. 2018లో మద్దతు ధర ప్రకటించే విధానాన్ని నిర్ణయించగా రైతు సంఘాలన్నీ అశాస్త్రీయంగా ఈ విధానం ఉందని నిరసన వ్యక్తం చేశాయన్నారు. కానీ ఈరోజు ఆ విధానాన్ని పరిగణంలో తీసుకొని నిర్ణయించారని తెలిపారు.

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని పసుపుని సైతం ఆహార దినుసులుగా ప్రకటించి ఎంఎస్పీ జాబితాలో చేరుస్తామని చెప్పిన వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. మరోవైపు కార్పొరేట్ శక్తుల రుణాలను 30 లక్షల కోట్లకు పైగా రద్దుచేసి స్వామి భక్తిని చాటుకుంటున్నారని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలను సందర్శించిన సీఎంవో అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం సీఎంవో అధికారి శ్రీనివాసరావు, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి సందర్శించారు. పాఠశాలలో పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, ప్రమోషనల్ యాక్టివిటీ స్టేటస్, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వారు పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన మరుగుదొడ్లు, మూత్రశాల నిర్మాణాలను వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాసం శ్రీనివాస్ గౌడ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సురేందర్, ఉపాధ్యాయులు స్వరూప రాణి, స్వప్న పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు.. పుస్తకాలు విక్రయిస్తే చర్యలు

- మండల విద్యాశాఖ అధికారి


పాఠశాల ఫైళ్లను పరిశీలిస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-బాల్కొండ

ఉమ్మడి బాల్కొండ మండల విద్యాశాఖ అధికారి గురువారం పాఠశాలలను సందర్శించారు. మండల పరిధిలో పలు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో మండల విద్యాశాఖ అధికారి ప్రైవేట్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం బయట పుస్తకాలు విక్రయిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు రావడంతో మండల విద్యాశాఖ అధికారి ఆ పుస్తక విక్రయ కేంద్రాన్ని చేరుకొని సీజ్ చేశారు. మండలంలోని ఎయిడెడ్ పాఠశాల సెయింట్ ఈఏఎస్ పాఠశాలను సందర్శించారు. అక్కడ కూడా పాఠ్య పుస్తకాలు బయట విక్రయిస్తున్నారని ఫిర్యాదు రావడంతో యాజమాన్యానికి హెచ్చరించారు. దానికి వారు బయట పుస్తక విక్రయ కేంద్రానికి మాకు సంబంధం లేదని తెలియజేశారన్నారు. అలాగే అకాడమిక్ నాన్ ఆకాడమిక్ విషయాలపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఎక్కడ కూడా పుస్తకాలు విక్రయించిన శాఖాపరమైన చర్యలు తప్పవని, ఎక్కడ కూడా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించిన సీజ్ చేయడం జరుగుతుందని ఎం ఈ ఓ హెచ్చరించారు.

డిగ్రీ పరీక్షలకు వన్ టైం ఛాన్స్

- పరీక్షల షెడ్యూలు విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బిఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులు 2016, 2017, 2018 సంవత్సరాల్లో పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించలేని ఒకటవ, రెండు, మూడు, నాల్గు, ఐదు ఆరవ సెమిస్టర్ విద్యార్థులకు బ్యాక్ లాగ్ పరీక్షలకు వన్ టైం ఛాన్స్ పరీక్షలు జూలై 2 నుండి ప్రారంభమైతాయని పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల టైం టేబుల్ వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్ సైట్ లో పొందుపరచడం జరిగిందని పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ ఎం. అరుణ తెలిపారు.

హరిజనవాడను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



వాడను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి
పట్టణంలోని 4వ వార్డు హరిజనవాడలో గల సమస్యలను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ దృష్టికి కౌన్సిలర్ పిడుగు మమత తీసుకెళ్లగా, వెంటనే స్పందించి గురువారం డ్రైనేజీ సమస్య, నీటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. డ్రైనేజ్, నీటి సమస్యను త్వరలోనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ వనిత, కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి యూనిఫాం ధరించాలి

- హెచ్‌ఎం హన్మంత్ రెడ్డి



విద్యార్థులకు దుస్తులు అందజేత

నవతెలంగాణ-జుక్కల్
ప్రతీ విద్యార్థి ప్రభుత్వం అందజేసిన యూనిఫాంను ఖచ్చితంగా ధరించి పాఠశాలకు రావాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడివో శ్రీనివాస్, ఐకేపీ ఎపీఎం సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, సిసిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలతో ఆరోగ్యం

- ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్
- పలు గ్రామాల్లో నులిపురుగుల నివారణ మందులు పంపిణీ



పిట్లం : పిల్లలకు డివార్మింగ్ ట్యాబ్లెట్స్ వేస్తున్న ఆసుపత్రి సిబ్బంది



లింగంపేట్ : అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

నవతెలంగాణ-విలేకరుల బృందం
బోధన్ : విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండేలా వారిని మార్చాలని ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. అంతర్జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిశుభ్రమైన వాతావరణం వలన కడుపులో సూక్ష్మక్రిములు పెరిగి పిల్లలు అనారోగ్యానికి గురవుతారని కావున ఒక సంవత్సరం వయస్సున్న పిల్లల నుంచి 19 సంవత్సరాల వయస్సున్న యువకులు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ప్రతి 6 నెలలకొకసారి ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తుందని కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బోధన్ డివిజన్‌లో 325 పాఠశాలలో 96000 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డా.విద్య, హెచ్‌ఎం బాలచంద్రం, సీడీపీఓ జానకి, సూపర్‌వైజర్లు నిర్మల, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మండల పరిషత్ అధ్యక్షురాలు సునీత నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీపీ సునీత శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ మాత్రలు విద్యార్థులలో రక్తహీనత, పోషణ లోపం, చురుకుగా ఉండటానికి ఉపయోగపడతాయని తెలిపారు, కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సూపర్‌వైజర్‌లు జ్యోతి, శ్రీదేవి, సాయి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నులి పురుగుల మాత్రాలు తప్పకుండా వేసుకోవాలలి ఎడపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యధికారి ఫీర్దోస్ బేగం తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు గంగామని, సరిత, సూపర్‌వైజర్ రాజేష్, ఆస్పత్రి వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పిట్లం : జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ స్కూళ్లలో అల్బెండజోల్ ట్యాబ్లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నట్టల నివారణకు డివార్మింగ్ టాబ్లెట్స్ దోహదపడతాయన్నారు. ఎవరైనా ట్యాబ్లెట్స్ తీసుకొని పిల్లలకు ఈ నెల 27న మ్యాప్ అప్ ప్రోగ్రాం కింద తిరిగి మాత్రలు అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో నులిపురుగుల నివారణ దినోత్సవం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గల కస్తూర్బాగాంధీ, జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో ఎంపీపీ టేకులపల్లి వినీత దుర్గారెడ్డి, జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి నులిపురుగుల నివారణ దినోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ సుజన్‌కుమార్ మాట్లాడుతూ.. ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు ఉన్నవారికి నులిపురుగుల నివారణ మాత్రలు వేయడం జరుగుతుందని అన్నారు. మండల వ్యాప్తంగా ఒకటి నుండి 19 సంవత్సరాల 6647 మంది ఉన్నట్లు గుర్తించారు. గురువారం 5916 మందికి అల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీణ, సూపర్‌వైజర్లు సునంద, ఎంపిహెచ్‌ఈఓ రామారావు, ఎంపిహెచ్‌ఎ మురళి, లతా, మానెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ అందరి బాధ్యత

నసురుల్లాబాద్ : నులిపురుగుల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నసురుల్లాబాద్ ఎంపీడీవో కళావతి సూచించారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నులిపురుగు నివారణకు టాబ్లెట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. మండలంలోని బీర్కూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో నులిపురుగు నివారణకై విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. అలాగే నసురుల్లాబాద్ మండల ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి మాట్లాడుతూ గర్భిణులు, రెండు సంవత్సరాల లోపు పిల్లలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి తప్ప 2సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికీ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. నులి పురుగులు చాలా ప్రమాదకరమని, వీటితో రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. నులిపురుగుల నియంత్రణ చాలా కీలకమైన అంశమని, దీని పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వారికి కేటాయించిన విధులను సమన్వయంతో కట్టుదిట్టంగా నిర్వహించి 1 నుంచి 19 సంవత్సరాల వయస్సులో గల పిల్లలందరికీ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మందులు అందించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఈ వర్షాకాలంలో వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాము, ఆరోగ్య సిబ్బంది ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో నులిపురుగు మాత్రలను ఎం.పి.పి గైని అనుసూయ వేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆస్మా అఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నులి పురుగు నివారణ మాత్రలను ఎంపీపీ గాల్‌రెడ్డి విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు వరకు పిల్లలందరూ ఆల్బెండజోల్ టాబ్లెట్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, నాయకులు దయాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, లింబాద్రి, మెడికల్ ఆఫీసర్ యేమిమా, హెచ్ ఈ ఓ వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : విద్యార్థిని విద్యార్థులు నులిపురుగు మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్‌వో శోభరాణి సూచించారు. మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో ఎంతమంది పిల్లలున్నారో హాజరు పట్టికను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాల్లో స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాలున్న ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులకు నులి పురుగు మాత్రలను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

వైస్ చైర్‌పర్సన్‌ను కలిసిన మున్సిపల్ నాయకులు



వైస్‌చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఉరుదొండ అనితను మున్సిపల్ జిల్లా యూనియన్ (సిఐటియు) నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్‌కు బొకే అందించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ (సిఐటీయు) జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు దీపక్, పోతారం ప్రభాకర్, కాత్రాల ప్రభు, నాయకులు దీవెన శివరాజవ్వ జ్యోతి, భూలక్ష్మి, మల్లవ్వ, మీసాల రవి తదితరులు పాల్గొన్నారు.

స్మారక స్థూపం ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్
విప్లవోద్యమ నేత, శ్రామికవర్గ యోధుడు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డివి. కృష్ణ స్మారక స్థూపావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గురువారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్, సాలూర మండలంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డి.వి. కృష్ణ స్మారక స్తూపావిష్కరణ, 2వ వర్ధంతి సభలను జూన్ 26వ తేదీన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రేడియో స్టేషన్‌కు ఎదురుగా చంద్రనగర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోధన్ మండల కార్యదర్శి పడాల శంకర్, సహాయ కార్యదర్శి సుల్తాన్ సాయిలు, ఐఎఫ్‌టియు నాయకులు ఇర్షత్, పోశెట్టి, శంకర్, గంగాధర్, నాగేష్, లక్ష్మన్న, పరమేశ్వర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపు కోసం కృషి చేసిన నాయకులకు సహకరిస్తా

ఎంపీ సురేష్ షట్కార్

నవతెలంగాణ-మద్నూర్
తన గెలుపు కోసం కృషి చేసిన నాయకులందరికీ ఎల్లవేళలా సహకరిస్తానని ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. జహీరాబాద్ ఎంపీగా గెలుపొందిన సురేష్ షట్కార్‌ను గురువారం కాంగ్రెస్ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ ఉమ్మడి మండలం బిజెపి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన బీబీ పాటిల్ సొంత మండలం అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం మెజార్టీ తీసుకొచ్చినందుకు మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులందరికీ రుణపడి ఉంటానని మీ కృషి మరువలేనని అభినందించారు. సురేష్ షట్కార్‌ను కలిసిన వారిలో రాంపటేల్, కొండ గంగాధర్, గడ్డం లక్ష్మణ్, వట్నాల రమేష్, తదితరులున్నారు.

తండ్రిని చంపిన కొడుకుకు ఐదేండ్లు జైలుశిక్ష

నవతెలంగాణ-బోధన్
మద్యం మత్తులో కన్నతండ్రిని చంపిన కొడుకుకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ బోధన్ 5వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎస్.రవికుమార్ గురువారం తీర్పు వెల్లడించారు. శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. బోధన్ కోర్టు లైజనింగ్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వర్ని మండలం శ్యామ్‌రావు తాండా కాకలదాస్ తాండ గ్రామపంచాయతీకి చెందిన మాలవద్దు ధూప్యనాయక్ భార్య గబ్బుభాయ్‌లకు గోపాల్, వినోద్, నవీన్ ముగ్గురు సంతానం. వినోద్ అనే వ్యక్తికి ఐదు సంవత్సరాల క్రితం సంక భాయితో పెళ్లయింది. వారికి ఇద్దరు కొడుకులు ఇంటిపక్కనే రేకులో నివాసం ఉంటారు. వినోద్ కొంతకాలంగా చుట్టుపక్కల గ్రామంలో దొంగతనాలు చేస్తూ జైలు జీవితం అనుభవించాడు. అయితే దొంగతనాలు చెయ్యొద్దని చెప్తున్నా తన భార్య సంకబాయితో, నాన్నతో గొడవపడ్డాడు. ఈ మధ్యనే వినోద్ ఒక దొంగతనం కేసులో బాన్సువాడ పోలీసులు జైలుకు పంపగా విడుదలై వచ్చాడు. గత 3-6-2021న మద్యం సేవించి ఇంటికి వచ్చి తన గుడిసెలో ఉన్న తన భార్య సంకా బాయ్‌తో అకారణంగా గొడవపడి కర్రతో కొడుతుండగా అది చూసిన ఆయన నాన్న ధూప్య గొడవ సద్దుమణిగేలా ప్రయత్నించాడు. 'నీవు, నా భార్య నన్ను రోజు తిడుతుంటారు. నువ్వెందిరా నాకు చెప్పేది. నిన్ను చంపేస్తా.' అంటూ తన చేతిలో ఉన్న కర్రతో నాన్న తలమీద కొట్టగా తలకు తీవ్రగాయమై రక్తం మడుగులో కింద పడిపోయాడు. స్పందించిన కుటుంబ సభ్యులు చికిత్స కొరకు బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో చనిపోయాడు. ఈ ఘటనపై మాలవత్ ధూప్య నాయక్ కుమారుడు గోపాల్ 4-06-2024న వర్ని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై జి.అనిల్‌రెడ్డి కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ అశోక్‌రెడ్డి దార్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పోలీసుల తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శ్యామ్‌రావు వాదించగా గురువారం బోధన్ ఐదవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎస్.రవికుమార్ ముద్దాయికి ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తోపాటు వెయ్యి రూపాయల జరిమానాను విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో 18 నెలలు పాటు సాధారణ జైలు జీవితం అనుభవించాలని తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ఏసీపీ కే శ్రీనివాస్, రుద్రూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జయేష్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ కుమార్, బోధన్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కే శంకర్, సీడీవోలుగా దేవలింగం, ప్రసాద్ ఉన్నారు.

బాన్సువాడలో విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి

- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



పాఠశాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నసురుల్లాబాద్
బాన్సువాడ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం మంజూరు చేసిన భవన నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. గురువారం బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను మాజీ శాసనసభ సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సందర్శించారు. అక్కడే నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. పాఠశాల భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. భవన నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో పాటించాలని నాణ్యత లోపాలు లేకుండా స్థానిక నాయకులు అప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. నూతన భవన నిర్మాణం పనుల్లో భాగంగా నిత్యం వాటర్ క్యూరింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. విద్యార్థినుల సౌకర్యం కోసం నిర్మిస్తున్న టాయిలెట్స్‌ను వెంటనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థినుల కోసం వండుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినిలకు నాణ్యమైన భోజనం అందించాలని తాజా కూరగాయలతో వంటలు చేసి వండించాలని ప్రధానోపాధ్యాయులకు, వంట చేసే వారికి సూచించారు. మధ్యాహ్న భోజనం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాన్సువాడ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న విద్యా బలవృతంపై ఆయన ఓ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు విద్య బోధనపై విద్యార్థినులతో కాసేపు సంభాషించారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలని ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కలిగిస్తుందని ఆయన అన్నారు. వీరి వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు డి.అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
మండల కేంద్రంలోని జెడ్పిహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఎంపీపీ టేకులపల్లి వినీత, జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఇప్పటివరకు ఆయన అడ్మిషన్ల ప్రక్రియను తరగతులు కొనసాగించే తదితర అంశాలపై లెక్చరర్ విష్ణును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జడ్పిటిసి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగేలా తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తానని అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం అయ్యేలా చేస్తానని ఆయన అన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో వరుస చోరీలు

- 4 సార్లు దొంగతనం జరిగినా పట్టించుకునే వారు లేరు



సిలిండర్ దొంగిలించిన స్థలం

నవతెలంగాణ-బోధన్
బోధన్ మండలం భూలక్ష్మి క్యాంప్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో గత సంవత్సరం నుంచి వరుసగా దొంగతనాలు జరుగు తున్నాయి. తాజాగా బుధవారం రాత్రి సైతం దొంగలు అంగన్వాడీ గొళ్లెం ధ్వంసంచేసి గ్యాస్ సిలిండర్, గుడ్లు, నూనే ఎత్తుకెళ్లినట్లు అంగన్‌వాడీ టీచర్ శిరీష, ఐసిడిఎస్ సూపర్వైజర్ గోపి లక్ష్మీ తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబరులో, ఈ సంవత్సరం ఫిబ్రవరి, ఏప్రిల్‌లో దొంగతనం చేసినపుడు అంగన్‌వాడీ కేంద్రంలోని వస్తువులన్నీ దొంగిలించారని అంగన్వాడీ టీచర్ శిరీష తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నాలుగోసారి దొంగతనం జరిగి బియ్యం పప్పులు, గుడ్లు, నూనెలు దొంగిలించారని తెలిపారు. గతంలో పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రం గ్రామానికి చివరన ఉండడంతో వరుసగా దొంగతనాలు జరుగుతున్నా గ్రామస్థులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. 4 సార్లు అంగన్వాడీ కేంద్రంలో దొంగతనాలు జరుగుతున్న పోలీసులు సైతం ఇప్పటి వరకు దొంగలను గుర్తించకపోవడంపై అంతటా విమర్శల వస్తున్నాయి. చిన్నారులకు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం వస్తువులు దొంగల పాలవడంతో అంగన్వాడీ టీచర్ తీవ్రంగా కలత చెందుతున్నారు. త్వరలో ఈ కేంద్రాన్ని పాత పంచాయతీ గదిలో మార్చనున్నట్లు అంగన్వాడీ టీచర్ శిరీష తెలిపారు. ఇప్పటికైనా బోధన్ రూరల్ పోలీసులు స్పందించి దొంగలను పట్టుకుని దొంగిలించిన వస్తువులను రికవరీ చేసి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సిబ్బంది, గ్రామస్థులు కోరుతున్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఎడపల్లి
చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ పట్టణం రాకాసిపేటకు చెందిన భోగేవారు రమేష్(35) లేబర్ పనిచేస్తుంటాడు. కుటుంబ కలహాలతో మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో గల అశోక్ సాగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్‌పై దాడి

నవతెలంగాణ-బోధన్
మండలంలోని ఊట్పల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ జట్ల పట్ రవి అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కిషన్ అతని అనుచరుడు దాడి చేసినట్లు గురువారం బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జట్పట్ రవి అనే వ్యక్తి కిషన్ అనే వ్యక్తి వద్ద లారీ డ్రైవర్‌గా పని చేశాడు. ఈ క్రమంలో రవి స్థానంలో లారీ ఓనర్ కిషన్ మరో వ్యక్తిని పనిలో పెట్టుకోగా తన పాత జీతం డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు కిషన్ ఆయన అనుచరులు దాడి చేసినట్లు ఎస్సై తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ట్రాలీ ఆటో, బైకు వేలం

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ట్రాలీ ఆటో, బైకును శుక్రవారం వేలం వేయనున్నట్లు కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ పరిధిలో పట్టుబడిన హీరోహోండా స్ప్లెండర్ ద్విచక్ర వాహనానికి ప్రారంభ ధర రూ.25వేలు, ట్రాలీ ఆటో ప్రారంభ ధర రూ.1,25,000 నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ముందుగా రూ.5000 డిపాజిట్ చేసి తమ పేరును నమోదు చేసుకోవాలని, ఆ తర్వాత వేలంపాటలో పాల్గొనేందుకు వీలుంటుందని ఆయన తెలిపారు.

కల్లూరులో మలేరియా, లార్వా సర్వే

నవతెలంగాణ-పోతంగల్
మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం మలేరియా, లార్వా సర్వే అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియాను తగ్గించాలనే ఉద్దేశంతో వానకాల ప్రారంభం వలన ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మలేరియా నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.

ఉత్తమ రక్తదాతను అభినందించిన మిత్ర బృందం

నవతెలంగాణ-కామారెడ్డి
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రక్తదాత పురస్కారాన్ని అవార్డు అందుకున్న ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలును గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మిత్ర బృందం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 73 సార్లు రక్తదానం చేసి రాష్ట్రంలోనే ఉత్తమ రక్తదాత పురస్కారాన్ని ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా బాలు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ వసంత్ కుమార్, భాస్కర్ వర్మ, డాక్టర్ వేద ప్రకాష్, లెక్చరర్ గంగాధర్, సాక్షి సీనియర్ రిపోర్టర్ గణేష్, తదితరులు ఉన్నారు.

గోశాలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బోధన్
పట్టణంలోని ఏకచక్రేశ్వర గోశాలకు రేకులషెడ్డు నిర్మాణం కోసం నిజామాబాద్‌కు చెందిన దాతలు బాలకృష్ణ, కమల్ కిశోర్ ఇనాని గురువారం రూ.5లక్షలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారికి గోశాల నిర్వహణ కమిటీ, గోసేవా సమితి ప్రతినిధులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు పరిశీలన

ఎంపీడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిధులతో చేపట్టిన మరుగుదొడ్లను ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్, ఎంఈఓ గణేష్ రాహుల్ గురువారం పరిశీలించారు. పనులను వేగవంతం చేస్తూ నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌కు వారు ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ శంకర్, ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు తాహెర్, తదితరులు ఉన్నారు.

ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత యూనిఫామ్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ అయ్యప్ప శ్రీనివాస్, వైస్ చైర్మన్ షేక్ మున్న వార్డ్ కౌన్సిలర్ ఇట్టెడి నర్సారెడ్డి తదితరులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇంఛార్జి కె. నవనీత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు వస్తే ఈనెంబర్లకు సంప్రదించండి

నవతెలంగాణ-ఆర్మూర్

వర్షాకాలం నేపథ్యంలో ఎటువంటి సమస్యలు వచ్చిన విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని డిఈఈ సిహెచ్ హరిచంద్ నాయక్ గురువారం తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని ఆర్మూర్ ఏడిఈ శ్రీధర్ 9440811604, పెర్కిట్ ఏడిఈ రాజేశ్వర్ 8331034982, పట్టణ ఏఈలు మనీషా 9440811629, అశ్విత రెడ్డి 7382 055537, పెర్కిట్ ఏఈఈ భాస్కర్ ప్రసాద్ 9440811630, దేగాం ఏఈ శ్రావణ్ కుమార్ 9440811631 నెంబర్లకు ఫోన్లు చేయవచ్చని డిఈఈ తెలిపారు.

సోషల్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌లో బట్టాపూర్ వాసులు



సామంత్‌రెడ్డి



నరేష్ గౌడ్

నవతెలంగాణ-ఏర్గట్ల

సోషల్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌లో నూతన కమిటీలను నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్, నేషనల్ జనరల్ సెక్రెటరీ మామిడాల మనోహర్ కలిసి ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామానికి చెందిన కట్కం సామంత్ రెడ్డిని డిస్ట్రిక్ డైరెక్టర్‌గా, కైరి నరేష్ గౌడ్‌ను ఆర్మూర్ కాన్సెన్సీ చైర్మెన్‌గా నియమించారు. ఎన్నికైన సభ్యులకు రాష్ట్ర చైర్మన్ నోముల సంపత్ గౌడ్, డిస్ట్రిక్ చైర్మన్లు దత్తు గౌడ్, చంద్రకాంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు సామంత్ రెడ్డి, నరేష్ గౌడ్ మాట్లాడుతూ... రాజ్యాంగంలో ఉన్న మానవ హక్కులను హరించడం గాని,అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తమ ---దృష్టికి తేవాలని కోరారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంతోష్‌కుమార్

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టి పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సంతోష్ కుమార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో రోడ్డు వెంబడి పిచ్చి మొక్కలు తొలగింపు, మురికి కాలవల్లో పూడిక తీత పనులు, నీళ్ల నిలిచిన ప్రాంతాల్లో నీటిని తొలగించడం, దోమల నివారణకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించడం, కారోబార్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, మహిళా సంఘాలు ఇంటింటికి తిరిగి ఇండ్లలో నిలువ ఉన్న నీటిని తొలగించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం ఆంటీ లార్వా స్ప్రే చేయడం, సాయంత్రం ఫాగింగ్ చేయడం వంటి పనులు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాటం చేసిన మహెూన్నత వ్యక్తి కొమురంభీమ్

- ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



కొమురంభీమ్ విగ్రహానికి పూలమాలలు వేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

కొమరం భీం గొప్ప పోరాట యోధుడు, ఆదివాసీల కోసం అలుపు ఎరుగాని పోరాటం చేసిన మహెూన్నత వ్యక్తి అని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండలంలోని గాదేపల్లి గ్రామంలో గురువారం కొమరం భీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసీల పోరాటం ఐక్యతకు ప్రతీక అని అన్నారు. అన్ని రంగాల్లో ముందుకు రావాలని రాజకీయాలకు అతీతంగా ఉండాలని, ప్రతి పని దాంట్లో మంచి చెడూ ఉంటాయి అని కేవలం మంచికి మాత్రమే వినియోగించుకోవాలని నాయికపోడు సంఘం అభివృద్ధికి అవసరమైన నిధులు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయికపోడు సంఘం అధ్యక్షుడు శ్రీను, ఎంపీటీసీ చిన్న రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, మరంపల్లి గంగాధర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా పూర్తికాని గోడౌన్ నిర్మాణం



పూర్తికాని గోడౌన్ పనులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోగల మోపాల్ సొసైటీ పరిధిలోని కంజర గ్రామంలో గత సంవత్సరం 12 లక్షల రూపాయల వ్యయంతో గోడౌన్ నిర్మాణం చేపట్టారు. ఈ గోడౌన్ తొందరగా పూర్తయితే రైతులు ఫర్టిలైజర్‌నీ మోపాల్ మండల కేంద్రానికి వెళ్లి తీసుకోకుండా తమ గ్రామంలోని తీసుకోవచ్చని ఇబ్బంది కలగకుండా ఉంటుందని అనుకున్నారు. కానీ సంవత్సరాలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ గోడౌన్ నిర్మాణం గురించి సాక్షాత్తు డిసిఒ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లిన కూడా సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. మళ్లీ నాట్లు వేసే సమయం వచ్చిందిజ ఫర్టిలైజర్ కోసం రైతులు మళ్లీ మండల కేంద్రానికి వెళ్లి తీసుకోవాల్సి వస్తుంది. రైతుల కోసం ఏర్పాటు చేసిన సొసైటీ ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి ఈ గోడౌన్ నిర్మాణం పూర్తయ్యే విధంగా చూడాలని కోరుతున్నారు.



ఏర్గట్ల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పలువురు



ఆర్మూర్: చేపూర్ గ్రామంలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న ఆశావర్కర్



భీంగల్‌లో...

ఆల్బెండజోల్ మాత్రలను తప్పకుండా వేయించాలి

- డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్
- పాఠశాలలు, కళాశాలల్లో పంపిణీ

నవతెలంగాణ-విలేకరులు

నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్లు, కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లల కు మాత్రలను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆర్మూర్ : అల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేసుకోవాలని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రమేష్ విద్యార్థులకు సూచించారు మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోగల ప్రాథమిక పాఠశాల మరియు ఉన్నత పాఠశాల లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం మామిడిపల్లి వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల విసర్జన తర్వాత, మట్టిలో ఆడిన తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని, చేతికి గోర్లను వారానికి ఒకసారి కత్తిరించుకోవాలని లేదంటే వీటి ద్వారా మట్టి ఆహారం తీసుకునే సమయంలో కడుపులోకి వెళ్లి నులిపురుగులు తయారు అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. నులిపురుగులు కడుపులో ఏర్పడటం వల్ల తరచుగా కడుపునొప్పి, రక్తహీనత ఏర్పడుతుందని విద్యార్థులకు సూచించారు. వంట చేసే సమయంలో కూరగాయలను శుభ్రంగా కలిగిన తర్వాతనే వండుకోవాలని తెలిపారు. ఆరు బయటకు మలవిసర్జనకు వెళ్ళినప్పుడు తప్పకుండా చెప్పులను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ సభ్యుని అధికారి సాయి ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, శ్యామల, స్టాఫ్ నర్స్ స్రవంతి, ప్రధానోపాధ్యాయులు రవీందర్ పాల్గొన్నారు.

భీంగల్ : సంతోష్ నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మలక జనార్దన్ మాట్లాడుతూ.. ఆల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు రక్తహీనతను తగ్గించి పోషణను అందిస్తాయని తెలిపారు. ఈ మాత్రలతో విద్యార్థుల మేధాశక్తి పెంపొందడంతోపాటు చురుకుగా ఉంటారని అన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని పెర్కిట్ లోని అంగన్వాడి స్కూల్లో ఆల్బెండజోల్ మాత్రలు చిన్నారులకు అందజేశారు. రెండు సంవత్సరాల వరకు చిన్నారులకు సగం మాత్ర ఆపై నుండి 19వ సంవత్సరాలవరకు ఒక మాత్ర వేశారని తెలిపారు. పిల్లలు కడుపునిండా భోజనం చేసిన తర్వాత అర గంట తర్వాత ఈ టాబ్లెట్ వెయ్యాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ టీఎస్టీవో జిల్లా అధ్యక్షురాలు తార ఆయమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చేపూర్ అంగన్వాడి కేంద్రంలో.. మండలంలోని చేపూర్ గ్రామ అంగన్వాడి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకటరమణమ్మ పాల్గొని అల్బెండజోల్ మాత్రలను వేశారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని చౌట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ సుప్రియ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాల్లో, ఐటిఐ కాలేజీలో అల్బండజోట్ మాత్రలు వేశారు. ఈమాత్రలవల్ల పిల్లల్లో రక్తహీనత తగ్గుతుందని, తద్వారా పిల్లలు చాలా చురుకుగా, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈరోజు పాఠశాలలకు హాజరు కాని విద్యార్థులకు ఈ నెల 27న మాత్రలు వేస్తామని తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్లు ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్ తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ ఆరోగ్య ప్రదాత తేజస్వి పాల్గొన్నారు.

మాక్లూర్ : ఆలుర్ మండల పరిధిలోని కల్లెడ ప్రభుత్వ పాఠశాలలో నులి పురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ క్రాంతి పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులి పురుగులు సన్నని దారంలాగా పేగులకు అంటిపెట్టుకొని రక్తాని పీలుస్తుంటాయని తెలిపారు. కలుషితమైన ఆహారం తీసుకోవడం వల్ల నులి పురుగులు కడుపులోకి చేరే అవకాశం ఉందని అన్నారు. భోజనానికి ముందు తర్వాత మాలవిసర్జన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, డా. ప్రకాశ్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఏర్గట్ల : ఏర్గట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న అన్ని గ్రామాల అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్ళు, కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థులకు,వైద్యులు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్ వైజర్ ఆకుల మారుతి మాట్లాడుతూ...నులి పురుగులు పిల్లల శరీరంలో ఉండడం వల్ల,వారికి రక్తహీనతతో పాటు, వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు పెరగరని, సరైన పోషకాలు అందవని అన్నారు. దీనికోసం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని,ఇవి నులిపురుగులను నివారిస్తాయని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పందరీ పాల్గొన్నారు.

మోపాల్ : బోర్గాం(పి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. మొత్తం 650 మంది విద్యార్థులకు మాత్రలు ఇచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు శంకర్ తెలిపారు.



జక్రాన్‌పల్లిలో...



కమ్మర్‌పల్లిలో...



మాక్లూర్‌లో...

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నవతెలంగాణ-ఆర్మూర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఈనెల 24న కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎంఈఓ కార్యాలయంలో సిబ్బంది రవికి గురువారం వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల కార్యదర్శి జక్కం సుజాత మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈనెల 24న నిజామాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందుకు అందరు సహకరించాలని వారు కోరారు. 9, 10 బిల్లులు మొత్తం పెండింగ్లో ఉన్నాయని, వంట పాత్రలు, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని అన్నారు. బిల్లులు ఐదో తారీకు లోపల చెల్లించాలని అన్నారు ఇప్పటికే అప్పులు చేసి పిల్లలకు సొంత పిల్లల్లాగా వంట చేసి పెట్టినప్పటికీ స్కూల్లలో హెడ్మాస్టర్లు మూడుసార్లు కోడిగుడ్లు పెట్టాలని రోజు కూరగాయలతో వంట చేయాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో బిల్లులు రాకపోవడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే పెండింగ్లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని ఈనెల 24 నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఆర్మూర్ మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు సత్తెమ్మ, అనసూయ, భవిత, షాహిన్ సుల్తానా, లక్ష్మి, నర్సు బాయ్, దయమని, అశోక్ భూలక్ష్మి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై

24న ధర్నాను జయప్రదం చేయండి : సీఐటీయూ



ఏడికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై జూన్ 24న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్లో ఉన్న గౌరవ వేతనం, గుడ్డు బిల్లును వెంటనే విడుదల చేయాలని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి తీర్చలేక వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు అవసరమైన సబ్సిడీ కింద ఉచితంగా గ్యాస్ బండలు ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కార్మికులకు 10వేల గౌరవ వేతనవం అమలు చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాల అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టినట్టు తెలిపారు. ఈ ధర్నాలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత, డి లక్ష్మీ, శిరీష, పోశెట్టి, సుదర్శన్ రెడ్డి, రజియా బేగం, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తక్షణ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోండి

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థినుల కోసం తక్షణ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. ధనవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. విద్యార్థినులు ఎస్ఎస్సి మెమో, ఇంటర్ మెమో, టిసి, కుల, ఆదాయ బోనఫైడ్ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని కళాశాలకు రావాలని కోరారు.

రెస్టారెంట్లపై కొరడా

- ఫ్రిజ్లో నిల్వ ఉంచిన రైస్, గ్రేవీ పదార్థాలు
- కుళ్ళిపోయిన చికెన్.. నిల్వ ఉంచిన మాంసం
- టేస్టింగ్ సాల్ట్, కలర్స్ స్వాధీనం



నిలువ ఉంచిన గ్రేవి, మాంసం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజల ప్రాణాలతో చెలగాటం మాడుతున్న రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కొరడా ఝులుపిస్తున్నారు. గురువారం నిజాంబాద్ నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలో గల ఎమ్మెస్సార్ బార్ అండ్ రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ అధికారి తారా సింగ్ నాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఫ్రిజ్లో నిల్వ ఉంచిన చికెన్, కొన్ని రోజుల క్రితం వండిపెట్టిన చికెన్ లెగ్ పీస్‌లు, ప్రాణాంతకరమైన టేస్టింగ్ సాల్టు కలర్స్, ఇతర ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఐదు రోజుల క్రితం వండి ఫ్రిజ్లో నిల్వ ఉంచిన గ్రేవీని, ఆహార పదార్థాలను చెత్తబుట్టలో వేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ అధికారి టి.నాయక్ హెచ్చరించారు. రెస్టారెంట్లు హెూటల్లు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు పరిశుభ్రత పాటించాలని అన్నారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు వాడితే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

షబ్బీర్ అలీ ఫౌండేషన్ ద్వారా బాధితుడికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని సంగమేశ్వర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నీల నర్సింలు తన ఇంట్లో ప్రమాదవశాత్తు పడిపోవడంతో బలమైన గాయాలు కావడంతో విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించిన ఆయన అతనికి షబ్బీర్అలీ ఫౌండేషన్ ద్వారా పదివేల రూపాయలను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడి కుటుంబ సభ్యులు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మహ్మద్ షబ్బీర్ అలీ అండగా ఉండి కష్టసుఖాలలో ఆదుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వర్ గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

5

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | జూన్ 21, 2024 | www.navatelangana.com

ప్రజా సమస్యలపై దృష్టిపెట్టండి

ఎమ్మెల్యే తోటా లక్ష్మికాంతారావు హితవు

నవతెలంగాణ-మద్నూర్



మండలంలో ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని నాయకులకు జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు హితవు పలికారు. జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఎమ్మెల్యే అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో మద్నూర్ మండలంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సాఫీగా పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- సమన్వయ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆయా పరీక్షలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. ఈ నెల 24 నుండి 29 వరకు జరుగనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాత పరీక్షతో పాటు, ఈ నెల 30 నుండి జూలై 04 వరకు కొనసాగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాత పరీక్షను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్లో గురువారం సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ నెల 23 నిర్వహించనున్న నీట్ పీజీ ఎగ్జామ్ ఏర్పాట్లపై సమీక్ష జరుపుతూ, అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలు, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాత పరీక్షల్లో నిర్ణీత తేదీలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు కొనసాగుతాయన్నారు. నీట్ పీజీ ఎగ్జామ్ ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్షలు సాఫీగా కొనసాగేలా సంబంధిత అధికారులతో పాటు చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ చికిత్సకు ఏఎంఎంలను ఏర్పాటు చేయాలని, సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని అన్నారు. 144 సెక్షన్ అమలు చేస్తూ జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలన్నారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు కనీసం రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. అధికారులు అందరు సమన్వయంతో పనిచేయాలని, పరీక్షల నిర్వహణ, నిబంధనలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ శ్రీనివాస్, కలెక్టరేట్ పరీక్షల విభాగం పర్యవేక్షకుడు పవన్, ఆర్టీసీ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల సజ్జన్‌పల్లిలో ప్రభుత్వ ఉచిత పాఠ్య పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు దామోదర్ చేతుల మీదుగా విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు నులిపురుగు మాత్రలను వేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ భవాని, ఉపాధ్యాయులు పద్మ, కవిత, సంగమేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు

ఆరోగ్యమైన జీవితాన్ని పిల్లలకు అందిద్దాం

- వైద్యాధికారి శిరీష



మాట్లాడుతున్న వైద్యాధికారి శిరీష

నవతెలంగాణ-నిజంసాగర్

ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందించడం తల్లిదండ్రుల కర్తవ్యమని బాన్సువాడ డివిజన్ వైద్యాధికారి శిరీష అన్నారు. గురువారం నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఆమె మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలు వేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్తులో పిల్లలు ఆరోగ్యవంతులుగా తయారైతేనే వారిలో నైపుణ్యాభివృద్ధి పెంపొందుతుందని అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడం, శారీరక మానసిక అభివృద్ధికి తోడ్పాటు కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతూ ఆరోగ్యవంతమైన పిల్లలను తయారు చేస్తుందని ఆమె అన్నారు. మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రలు అందించనున్నారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి దేవిసింగ్, మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్ కుమార్, హెడ్‌మాస్టర్ రామచందర్, సిబ్బంది సిద్ధిరామేశ్వర్, వెంకట్, నారాయణ, మధుసూదన్, సునీత పాఠశాల సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ డీఎస్పీ, సిఐలకు సన్మానం



బొకే అందజేస్తున్న మైనార్టీ నాయకులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బక్రీద్ నేపథ్యంలో ప్రజల మధ్య శాంతి సామరస్యాన్ని, సోదరభావాన్ని పెంచేందుకు కృషి చేసిన బాన్సువాడ డి.ఎస్.పి సత్యనారాయణ, పట్టణ సీఐ కృష్ణను బాన్సువాడ మైనార్టీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. బాన్సువాడ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బాన్సువాడ పట్టణ మైనార్టీ నాయకులు డీఎస్పీని, సీఐని శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బాన్సువాడ పట్టణ మైనార్టీ నేత, శాదీఖానా చైర్మన్ అబ్దుల్ వాహాబ్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను బాన్సువాడ ప్రజలు అత్యంత శాంతి సామరస్యంలా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్‌లో పెట్టి పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చేసిన కృషిని ప్రశంసించారు. బాన్సువాడ డివిజన్ పోలీసులు చేసిన కృషిని ఎల్లప్పుడూ మర్చిపోమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ పట్టణ అధ్యక్షుడు, ఎండి, యూసుఫ్, సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ ఇలియాస్ అలీ, బగ్బాన్ కమిటీ మాజీ సదర్ షేక్ అజీమ్, నాయకులు కలీం పాల్గొన్నారు

పనులను పరిశీలించిన కలెక్టర్



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, డంప్‌యార్డ్, నర్సరీల పనులను గురువారం పరిశీలించి అధికారులకు, సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. మండల కేంద్రంలోని డంప్ యార్డ్‌ను సందర్శించి సేగ్రిగేషన్ వల్ల వస్తున్న ఆదాయం తక్కువగా ఉన్నదని, డ్రైవేస్ట్ ఇంకా బాగా జరిపి ఆదాయం పెంపొందించుకోవాలన్నారు. ధర్మారావుపేటలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నర్సరీని సందర్శించి ఇంకా మెరుగుపరచాలని, మొక్కల బ్లాక్‌లు క్రమపద్ధతిలో పెట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కల్వరాల హైస్కూల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తయినట్లు చెప్పారు. ఎంపిపిఎస్ పాఠశాలలో 50 మేర పనులు పూర్తయినట్లు గుర్తించారు. త్వరగా పనులు పూర్తి చేసి, ఎంబి రికార్డు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ కింద ఇంటింటా నీటి కుళాయి సర్వే పనులు ఎంతవరకు వచ్చాయి?, ఎలా చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శిని అడుగగా డోర్ లాక్ ఉన్నవి, పెండింగ్ ఉన్నాయని త్వరలో సర్వేపూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. క్షేత్ర స్థాయిలో పనుల పురోగతిని మళ్లీ పరిశీలిస్తానని అధికారులు ప్రగతిలో ఉన్న పనులు శరవేగంతో పూర్తి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో తరగతుల బోధన తీరును పరిశీలించి విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. విద్యార్థులు కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాప్రసాద్, ఎంపిడిఓ సంతోష్ కుమార్, ఎంపిఓ సురేందర్‌రెడ్డి, ఎంఈఓ యూసుఫ్, మిషన్ భగీరథ డీఈ, ఏఈ, పంచాయత్ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సబ్ జైలు భవనం



సబ్‌జైలు భవనం

నవతెలంగాణ-ఆర్మూర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఐదు సబ్ జైలులను తాత్కాలికంగా మూసివస్తున్నట్లు 2018 డిసెంబర్లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. అందులో పట్టణంలోని సబ్ జైలు భవనం ఉంది.

నిర్వహణ భారం కారణంగా..

నిర్వహణ భారం కారణంగా సబ్ జైలును మూసివేస్తూ జైలు శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జీవో నెంబర్ 6158 ను విడుదల చేశారు. అయితే సమైక్య పాలకుల హయాంలోనే సబ్ జైలును మూసివేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడినప్పటికీ స్థానికులు న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఇక్కడ పదిమంది రిమాండ్ ఖైదీలను ఉంచడానికి సౌకర్యాలతో నిర్మాణం చేసినప్పటికీ 20 నుంచి 25 మంది రిమాండ్ ఖైదీలను ఇక్కడ ఉంచడానికి అవకాశం ఉంది

అన్ని సౌకర్యాలు ఉన్న గత ఐదు సంవత్సరాలుగా నిరుపయోగంగా మారిపోయింది. దీంతో పలు కేసులలో పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖ అధికారులు సిబ్బంది రిమాండ్ ఖైదీలను జిల్లా కేంద్రానికి తరలించే విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ కోర్టుకు తరలించిన రిమాండ్ ఖైదీలను జిల్లా కేంద్రంలోని జైలుకు తరలించడంలో అన్ని మండలాల పోలీసులు మాత్రం ఈ సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. గతంలో జైలు ఉపయోగంలో ఉన్న సమయంలో తీసుకు వెళ్లడానికి అవకాశం ఉండేది. ప్రస్తుతం ఈ ఖైదీలను జిల్లా కేంద్రానికి తరలించాల్సి ఉండడం తో ఎస్కార్ట్ పోలీసుల సహాయం తప్పని పరిస్థితిగా మారింది.

డివిజన్ పరిధిలోని....

డివిజన్ పరిధిలోని ఆర్మూర్,, నందిపేట, జక్రాన్ పల్లి, బాల్కొండ, కమ్మర్పల్లి, భీమ్గల్, సిరికొండ మండలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులను ఇక్కడ విచారిస్తారు. దీంతోపాటు భీమ్‌గల్, మోర్తాడ్, ఆర్మూర్ ఎక్సైజ్ కార్యాలయానికి చెందిన కేసులు ఇక్కడే విచారిస్తారు. కాగా విచారణలో భాగంగా నిందితుడుగా ఉన్నా రిమాండు ఖైదీలను పట్టణ సబ్ కోర్టులో బంధించేవారు. శిక్షలు ఖరారైన తర్వాత వారిని జిల్లా జైలుకు తరలించేవారు. గత ప్రభుత్వం జైలును ఎత్తివేయడంతో రిమాండ్ ఖైదీలను జిల్లా కేంద్రానికి ఎస్కార్ట్ తో తరలించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో ఖైదీలను కోర్టుకు తరలించే బాధ్యత నిర్వహించే పోలీసులపై మరింత పని భారం పెరిగింది. సమస్యను గుర్తించి ప్రభుత్వం సబ్ జైలును పునరుద్ధరించాలని ఎక్సైజ్, పోలీస్, ఫారెస్ట్ అధికారులతో పాటు న్యాయవాదులు కోరుతున్నారు.

రూ.18వేల గౌరవవేతనం ఇవ్వాలి

- పీహెచ్‌సీ వద్ద ఆశావర్కర్ల నిరసన



నినాదాలు చేస్తున్న ఆశావర్కర్లు

నవతెలంగాణ-రెంజల్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్ల పట్ల వివక్ష చూపుతూ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆశా వర్కర్లు గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల మండల కార్యదర్శి కవిత, కోశాధికారి స్రవంతి మాట్లాడుతూ ప్రభుత్వం ఆశ వర్కర్లకు వెట్టిచాకిరీ చేయించుకొని పనికి తగిన వేతనాన్ని చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లకు నెలకు 18 వేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీంతోపాటు ప్రభుత్వం పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆశాలకు గౌరవేతనంతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, మండలంలోని ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

బీడీ కార్మికులకు ప్యాకర్లకు, బట్టి, బీడీ టేకేదార్లకు, బీడీ కట్టలకు బుర్రలు పెట్టే కార్మికులకు వేతనాలు పెరిగిన సందర్భంగా కామారెడ్డి జిల్లా పాత రాజంపేట్, టెలిఫోన్ బీడీ కార్మికులు గురువారం తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సిద్దిరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆంజనేయులుకు బీడీ కార్మికులు శాలువాలతో సన్మానించి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు జి.రమ, చందన, సిహెచ్ లత, లక్ష్మి, కవిక, లత, సునిత, చంద్రకళ, విజయ, పద్మ, చెన్ను, అంజుమ్, బాలమణి, శ్యాల, పద్మజా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో పడగల సురేష్ తాపీ మేస్త్రిగా చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం అకస్మాత్తుగా చనిపోవడంతో తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షులు పెద్దనాగిరెడ్డి ఆధ్వర్యంలో రూ.18వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రి నీలం శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విశ్రాంత భవన స్థలంపై లీడర్ల కన్ను

- చదును చేస్తున్న సమయంలో అడ్డుకున్న స్థానికులు
- స్థలాన్ని కాపాడాలని స్థానికుల విన్నపం



విశ్రాంత భవనం స్థలంలోవేసిన మొరం

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందర ఉన్న ప్రభుత్వ స్థలంపై కొందరు అధికార పార్టీ లీడర్లు కన్నేశారు. బుధవారం స్థానిక లీడర్లు భూమి మాదే అంటూ ఆ స్థానంలో మొరం పోయించగా స్థానికుల, వీడీసీ సభ్యులు మొరం పోయకుండా అడ్డుకున్నారు, ఈ స్థలంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఏడాది క్రిందట విశ్రాంత భవనం కోసం ఎస్డి ఎఫ్ ద్వారా 40 లక్షలు రూపాయలు మంజూరు చేసి సంకుస్థాపన చేశారు. అధికార పార్టీ అండతో భూమి మాదేనని కబ్జా చేయడానికి యత్నించారు, విషయం తెలుసుకున్న వీడిసి. స్థానికులు అడ్డుకున్నారు. కలెక్టర్ స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడి కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆ లీడర్ అధికార పార్టీకి మచ్చ తెస్తున్నారని స్థానికులు లీడర్లు చర్చించుకుంటున్నారు. కబ్జాకు పాల్పడిన అధికార పార్టీ లీడర్ పై చర్యలు తీసుకోవాలని మాజీ రూరల్ ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

తాగు, సాగునీరు అందించేందుకు షబ్బీర్ అలీ కృషి



మాట్లాడుతున్న జడ్పీటీసీ తిరుమలగౌడ్

నవతెలంగాణ-దోమకొండ

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ మంచి సంకల్పంతో ముందుకు సాగుతున్నారని జడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు అనంతరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ కృషితో 20వ ప్యాకేజీ పనులు పూర్తయ్యాయని, 21వ ప్యాకేజీ పనులు 70 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. రిజర్వాయర్ మాసాని ట్యాంకు నుండి కొండముచెరువు వరకు పూర్తి చేశారని వివరించారు. భూంపల్లి ట్యాంకు నుండి లిఫ్ట్ కోసం టర్నల్ పంపు మరమ్మతులు చేపట్టి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా కామారెడ్డి, ఎల్లారెడ్డి రెండు నియోజకవర్గాల ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి, అప్పటి రాష్ట్ర బొగ్గు, మైనారిటీ సంక్షేమం, వక్ఫ్ ఉర్దూ అకాడమీ, విద్యుత్ శాఖ రాష్ట్ర మంత్రిగా మహ్మద్ షబ్బీర్ అలీతో కలిసి 2008 సంవత్సరంలో పనులను శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రావులపల్లి నర్సరెడ్డి, నర్సయ్య, శమ్మీ, నర్సింలు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.